క్లుప్తంగా

చలో రాజ్‌భవన్ కార్యక్రమం విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించే ర్యాలీకి జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు. సీఎంతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, సీనియర్ నాయకులు ఈ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. దేశంలో గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, మనీ లాండరింగ్‌పై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా నేడు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళ కార్యదర్శిగా విజయలక్ష్మి



బాన్సువాడ: పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శిగా బాన్సువాడకు చెందిన ఏర్ల విజయలక్ష్మి ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన పద్మశాలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో విజయలక్ష్మి రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాన్సువాడ పద్మశాలి మహిళ సంఘం అధ్యక్షురాలిగా రెండేళ్లు పని చేసి పద్మశాలి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేశానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినందుకు రాష్ట్ర స్థాయి పద్మశాలి మహిళ సంఘం నేతలకు ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు.

జాయింట్ సెక్రెటరీగా పద్మ శ్రీకాంత్..



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ రాష్ట్ర పద్మశాలి సంఘం జాయింట్ సెక్రెటరీగా మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యవర్గం హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేయగా ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్‌ను జాయింట్ సెక్రెటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

మధ్యాహ్న భోజనాన్ని తప్పకుండా పరిశీలించాలి



నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రోజు తనిఖీ చేయాలని మహమ్మద్‌నగర్ మండల విద్యా శాఖ అధికారి అమర్‌సింగ్ సూచించారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రాజ్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికతో విద్యార్థులకు పాఠాలు బోధించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తొంభై రోజుల ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు పాఠాలు బోధించాలని, విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. ఆయన మంగళవారం తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అధ్యాపకులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కళాశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెచ్చినట్లయితే సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. గత సంవత్సరం కంటే ఈసారి మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. 2025 ఫిబ్రవరి నెలలో ప్రీఫైనల్, ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపల్ యూసుఫ్ హుస్సేన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ధ్వంసమైన మిషన్ భగీరథ పైపులు



తండాలో నిర్మించిన మిషన్ భగీరథ నీటి ట్యాంకు



తండాకు వెళ్లే ప్రధాన దారి

సమస్యల వలయంలో కర్ణంగడ్డ తండా

- ఇప్పటికీ తండాలో రోడ్లు, మురికి కాలువలు లేని పరిస్థితి
- కొన్నేళ్ల నుంచి తాగునీటి సమస్య
- మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించి, కుళాయిలు బిగించడం మరిచిన అధికారులు
- ట్యాంకు వద్దకే వెళ్లి నీళ్లు తీసుకెళ్తున్న మహిళలు
- ప్రభుత్వాలు ఎన్ని మారినా తమ రాత మారడం లేదని తండావాసుల ఆవేదన



తండాలో మురికి కాలువలు లేని రోడ్లు

గాంధారి(ఎల్లారెడ్డి): పోతంగల్ కలాన్ గ్రామ పంచాయతీ పరిధిలోని కర్ణంగడ్డ తండావాసులు సమస్యలతో సావాసం చేస్తున్నారు. తండాలో ఇప్పటికీ కనీస సదుపాయాలు రోడ్లు, మురికి కాలువలు లేవు. కొన్నేళ్లుగా తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి కాని తండావాసుల తల రాతలు మారడం లేదు. ఈ తండా గాంధారి–బాన్సువాడ ప్రధాన రహదారి నుంచి ఐదు కిలో మీటర్లు, పోతంగల్ కలాన్ గ్రామ పంచాయతీ కేంద్రం నుంచి 3 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. తండాలో 78 కుటుంబాలు, సుమారు 500 మంది జనాభా ఉంది. తండాలో తాగునీటి సమస్యను తీర్చాలని తండా వాసులు నాయకులు, అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కానీ ఇప్పటికీ తాగు నీటి సమస్య తీరలేదు. పోతంగల్ కలాన్ గ్రామ పంచాయతీ కేంద్రానికి రావాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలే బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.4.32 కోట్లు మంజూరు కావడంతో రోడ్డు పనులు సాగుతున్నాయి. తండాలో తాగు నీటి సమస్య తీర్చాలని, రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని నాయకులు, అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎవరూ పట్టించుకోవడంలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని గ్రామాలు, తండాలతో పాటు కర్ణంగడ్డతండాలో మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించారు. ట్యాంకు వరకు నీళ్లు వస్తున్నాయి. ట్యాంకు నింపుతున్నారు. ట్యాంకు నిర్మించిన అధికారులు తండాలో కుళాయిలు అమర్చలేదు. తండాలో ఇంటింటికి నీటి సరఫరా కోసం నాసిరకం పైపులను పైపైన రాళ్ల మీద వేయడంతో అవి ధ్వంసమయ్యాయి. ఫలితంగా భగీరథ నీరు ట్యాంకు వరకే పరిమితమయ్యాయి. మహిళలు ట్యాంకు వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తండాలో రోడ్లు, మురికి కాలువలు ఇప్పటికీ నిర్మించలేదు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లో కూడా గ్రామ పంచాయితీ నుంచి తండాలో ఒక్క మీటరు సీసీ రోడ్డు కూడా వేయలేదు. తండా అన్ని విధాలుగా, అన్ని విషయాల్లో నాయకులు, అధికారుల



నిర్లక్ష్యానికి గురవుతోంది. కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోవడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా తమ సమస్యలు తీర్చాలని తండా వాసులు కోరుతున్నారు.

ఎవరూ గుర్తించడంలేదు



మా తండాను నాయకులు, అధికారులు గుర్తించడంలేదు. తండాలో 500 మంది జనాభా ఉంది. ఇప్పటికీ రోడ్లు, మురికి కాలువలు లేవు. రాళ్ల మీదనే నడుస్తున్నాం. రాళ్లల్లో పాములు, తేళ్లు ఉంటున్నాయి. పిల్లలు, మహిళలు భయంతో జీవనం సాగిస్తున్నాం. ఇప్పటికైనా నా తండాలో సదుపాయాలు కల్పించాలని కోరుతున్నాం.

– నేనావత్ జీవన్, కర్ణం గడ్డ తండా

ఇంటింటికి నీరు రావడంలేదు



తాగు నీటి కోసం అన్ని గ్రామాలతో పాటు మా తండాలో ట్యాంకు నిర్మించారు. కాని తండాలో ఇంటింటికి నీటి సరఫరా కోసం పైపులు వేయలేదు. ఒకటి రెండు నాసిరకం పైపులు పైపైన రాళ్లపై వేసి వెళ్లిపోయారు. వాటి నుంచి చుక్క నీరు రాలేదు. పైపులన్నీ ధ్వంసమయ్యాయి. వీధుల్లో రోడ్లు లేక రాళ్లపైనే నడుస్తున్నాం. మురికి కాలువలు లేక ఇళ్ల ముందే మురికి నీరు పారుతుంది.

– లావడ్యా తిరుపతి, కర్ణం గడ్డ తండా

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం



మాట్లాడుతున్న విఠల్‌రావు

కామారెడ్డి అర్బన్: జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఉద్యోగులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా ట్రెజరీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా భవనంలో జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు అధ్యక్షతన మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా ట్రెజరీ అధికారి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. పెన్షనర్లకు చదరంగం, క్యారం, సింగిల్, డబుల్ నంబర్ మ్యాచింగ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విశ్వనాథం, జిల్లా ప్రతినిధులు మల్లేశం, ఆకుల నర్సింలు, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి



బీబీపేట: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నరేంద్ర అన్నారు. మంగళవారం ఉప్పర్పల్లి, ఇస్సానగర్ గ్రామాల్లో మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. కొన్నిచోట్ల మక్క పంట కంకి ఏర్పడే దశలో ఉందని, మూడో దఫా ఎరువుగా యూరియా 20 కేజీలు, పొటాష్ 35 కేజీలు వేయడం వల్ల కంకి ఎదుగుదల మెరుగవుతుందని ఏవో అన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఏఈవో రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



మద్నూర్(జుక్కల్): కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని మద్నూర్ మాజీ ఎంపీటీసీ రాములు డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని సర్వే నంబర్–583, 584, 846లో ప్రభుత్వ భూమిని పేదలకు గతంలో ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. కాని ఆ స్థలాన్ని పెద్దలు కబ్జా చేశారని ఆరోపించారు. పేదల భూమిని కాపాడటానికి ఉన్నతాధికారులకు కలిసి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానన్నారు.

జీపీ కార్మికుల ముందస్తు అరెస్టు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): జీపీ కార్మికులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా సోమవారం రాత్రి కార్మికులను అరెస్టు చేశారు. జీపీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాకలి బాల్‌నర్సు, మండలాధ్యక్షుడు సాయిలు, తదితరులున్నారు.

మంత్రి పదవి ఇవ్వాలని పాదయాత్ర



సదాశివనగర్/తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు అధిష్టానం మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సదాశివనగర్, తాడ్వాయి మండలాల్లో పాదయాత్ర చేశారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. సదాశివనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, తాడ్వాయి మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, షౌకత్‌అలీ, లక్ష్మణ్‌చారీ, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం కబ్జా అడ్డగింత

భిక్కనూరు: మండల కేంద్రంలో ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు యత్నించగా కొత్తపేట ప్రాంతానికి చెందిన ప్రజలు మంగళవారం అడ్డుకున్నారు. మండల కేంద్రం సమీపంలో పెద్దమల్లారెడ్డి గ్రామానికి వెళ్లే దారి పక్కన ఎకరం స్థలాన్ని శ్మశానవాటికకు 20 ఏళ్ల క్రితం బండి రాములు సర్పంచ్‌గా ఉన్నప్పుడు కేటాయించారు. మండల కేంద్రానికి చెందిన కొందరూ వెంచర్ పేరిట స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్ర పన్ని చదును చేసేందుకు యత్నించగా కొత్తపేట ప్రాంతానికి చెందిన పలువురు అడ్డుకున్నారు.

లగచర్ల రైతులపై కేసులు ఎత్తేయాలి



బిచ్కుందలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



బాన్సువాడలో ..



భిక్కనూరులో..



ఎల్లారెడ్డిలో..



చిన్నమల్లారెడ్డిలో..



తాడ్వాయిలో..



గాంధారిలో ..



రామారెడ్డిలో ..

సాక్షి నెట్‌వర్క్: రంగారెడ్డి జిల్లా లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని కోరుతూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. అనంతరం స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు మాట్లాడారు. రైతులపై కేసులు పెట్టడంతో వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, బేడీలు వేసి కోర్టుకు తీసుకురావడం సరికాదన్నారు. రైతుల భూములను లాక్కొని వారిని జైలు పాలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని శాపనార్థాలు పెట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దెత్తున నినాదాలు చేశారు.



బీబీపేటలో..



రాజంపేటలో..



అడ్లూర్‌ఎల్లారెడ్డిలో..



మాచారెడ్డిలో..



కామారెడ్డి జిల్లా కేంద్రంలో..



దోమకొండలో..

ఆదివాసి నాయక్‌పోడ్‌లకు న్యాయం చేయాలి



బాన్సువాడ రూరల్/నిజాంసాగర్: బాన్సువాడ డివిజన్‌లోని పలు మండలాల్లో ఆదివాసి నాయక్ పోడ్ కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడంలో తహసీల్దార్లు ఇబ్బంది పెడుతున్నారని మంగళవారం కులసంఘం ప్రతినిధులు సబ్‌కలెక్టర్ కిరణ్మయిని కలిసి విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కామారెడ్డి జిల్లా ఆదివాసి నాయక్‌పోడ్ గౌరవ అధ్యక్షుడు రామచంద్ర, జిల్లా అధ్యక్షుడు పెంటయ్య, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కూలి రేట్లు పెంచాలని వినతి



కామారెడ్డి టౌన్: సివిల్ సప్లయ్ హమాలీల ఎగుమతి, దిగుమతి కూలి రేట్లను పెంచాలని ఏఐటీయూసీ నాయకులు మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు మాట్లాడుతూ..కూలి రేట్లు రూ.26 నుంచి 29కి పెంచుతూ గత ప్రభుత్వంతోనే ఒప్పందం అయినా ఇప్పటి వరకు అమలు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు దశరథ్ తదితరులున్నారు.

మురికి కాలువ పనులు ఆపేయాలి



ఆందోళన చేస్తున్న ప్రజలు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న మురికి కాలువ పనులను మంగళవారం 15వ వార్డు ప్రజలు అడ్డుకున్నారు. కొత్తగా నిర్మిస్తున్న పెద్ద మురికి కాలువ నీరును 15వ వార్డులోకి మళ్లిస్తున్నారు. ఆ మురికి నీరు వార్డు ప్రజల ఇళ్లలోకి వెళ్తున్నాయి. చిన్న మురికి కాలువలో పెద్ద మురికి కాలువ ఎలా కలుపుతారు.. వర్షా కాలంలో వరద నీరు ఇళ్లలోకి రావడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ పనులు ఆపేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు వెడల్పు పనుల కారణంగా మిషన్ భగీరథ పైపులు పగిలిపోయాయని, తాగునీరు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. దీంతో జీపీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ అక్కడికి చేరుకుని సమస్య తెలుసుకున్నారు. మురికి వేరే చోటికి మళ్లిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సంక్షిప్తం

ముగిసిన శబరిమాత వార్షికోత్సవాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన గల శబరిమాత ఆశ్రమంలో మూడు రోజుల క్రితం ప్రారంభమైన 54వ వార్షిక జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిసాయి. చివరి రోజు కావడంతో ఇతర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి ఉత్సవాలలో పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నాచుపల్లి గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు గంపల సాయి కుమార్ కొన్ని రోజుల క్రితం కాలు విరిగింది. ఆయనను ఆర్థికంగా ఆదుకోవాలన్న ఉద్దేశంతో కోనేరు శశాంక్(ఎన్ఆర్ఐ) రూ.10 వేలు అందించినట్లు మండల బీజేపీ అధ్యక్షులు సున్నం సాయిలు తెలిపారు. నేతలు మేకల రాములు, శ్రీనివాస్ రావు, కంది మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యేక అధికారి కిషన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ భోజనాన్ని పరిశీలించిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలన్నారు. తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మక్‌పల్లి బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రాజు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి 162వ బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన లింగపల్లి రాజును పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరేందర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షుడు భాస్కర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్, నాయకులు గంగాధర్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా పోరాజ్

ఎల్లారెడ్డిరూరల్: అన్నాసాగర్ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా పోరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కార్యవర్గ సభ్యులు మంగళవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా సంజీవులు, కార్యదర్శిగా సాయికృష్ణ, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై మంగళవారం సమాచారహక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా సలహాదారులు లింగమయ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాణిక్యం తదితరులున్నారు.

రాజ్యాంగంపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలి

భిక్కనూరు: భారత రాజ్యాంగంపై ప్రతి పౌరుడికి అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు తలారి ప్రభాకర్ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంతో పాటు తిప్పాపూర్ గ్రామంలో భారత రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బోరంచ రాజలింగం, మండల కన్వీనర్ జంగం మహేష్, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.